# బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం



మోండా మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్/ మారేడ్‌పల్లి, నవంబర్ 16: సనత్‌నగర్ లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని, మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మోండా డివిజన్ బండిమెంట్, జై న్‌భవన్, సజ్జన్‌లాల్ స్ట్రీట్, టకార బస్తీ, పాట్ మార్కెట్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా బండిమెట్, ఆదయ్యనగర్ లలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ప్రతి ఇంటా పూలమాలలు వేసి స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని..అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే తన మెజార్టీకి దోహదం చేస్తాతాయని చెప్పారు. తాను పుట్టిన పెరిగిన ఈ ప్రాంతంలో ప్రజలందరూ స్వచ్ఛంధంగా ముం దుకు వచ్చి మద్దతు పలుకుతున్నారని, ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ మీ వెంట మే మున్నా ము అన్నా... అంటూ ముందుకు వస్తున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఏ నాడు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని.. ప్రజలందరూ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. సనత్‌నగర్‌లో ఎవరూ ఊహించని స్థాయిలో 1400 వందల కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు, జయరాజ్, సత్యనారాయణ, మహేష్, అమర్, ఆకుల హరి కృష్ణ పాల్గొన్నారు.

తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధితో భోలక్‌పూర్ బస్తీల రూపురేఖలు మారిపోయాయని, మరింత సేవ చేయడానికి ఈ నెల 30న తప్పకుండా ఓటువేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సాయంత్రం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని భోలక్‌పూర్, సుందరయ్యనగర్, ఆంజనేయస్వామి కాల నీ, ఎంఐజీ కాలనీ ప్రాంతాలలో ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ప్రతి బస్తీలో ఆయనకు అఖండ స్వాగతం లభించింది. అడుగడుగునా ఆయనకు మహిళలు మంగళహారతులను ఇచ్చి, విజయ తిలకం దిద్దారు. భోలక్‌పూర్‌లోని ప్రతి బస్తీలో తాను రోడ్లు, పార్కులు, వీధీ దీపాలు, కమ్యూనిటి హాళ్లు, ఆంజనేయస్వామి దేవాలయం, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చేశానని, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించానని అన్నారు. ఎలాంటి కష్టం వచ్చినా తాను పేదలకు అండగా ఉంటానని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని మంత్రి తలసాని అన్నారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే హేమలత, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్‌గౌడ్, అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కార్యదర్శి ఎం.మహేందర్, నాయకులు ఏసూరి మహేశ్, శ్రీ కాంత్‌రెడ్డి, టి.శ్రీను, బాబు, నాగరాజు, నర్సింహ, సురేశ్, వెంకట్, శాహెద్, రమణ, శ్రీనివాస్, మల్లేశ్, రవీందర్, ఎల్లేశ్వర్, లావణ్య, నాగలక్ష్మి, అమృత పాల్గొన్నారు.



మోండా మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తలసాని, ఆకుల రూప



మోండా మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళలను ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మంత్రి తలసానిని ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



భోలక్‌పూర్ ప్రచారంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి తలసాని



ఓటర్లకు అభివాదం చేస్తున్న మంత్రి తలసాని

## శ్రీరామ్‌నగర్‌లో నేడు ఆత్మీయ సభ

అమీర్‌పేట్, నవంబర్ 16 : కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మంత్రి తలసానికి కృతజ్ఞతగా అమీర్‌పేట్ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో శుక్రవారం సాయంత్ర 6 గంటలకు ఆత్మీయ సభ జరుగుతుందని ఎస్ఆర్‌నగర్ రాయల సేవా సమితి అధ్యక్షుడు ఆర్.సి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ కాలనీకి అతి పెద్ద సమస్యగా పరిణమించిన వరదనీటి ముంపు సమస్యను పరిష్కరించడమే కాక, చక్కటి డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థతో పాటు చక్కటి సీసీ రోడ్ల నిర్మాణాలకు కృషి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఎన్నికల్లో మద్దతుగా నిలిచేందుకు కాలనీ నివాసితులు నిర్ణయించడం జరిగిందని ఆర్.సి.కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ ఆత్మీయ సభకు మంత్రి తలసానితో పాటు మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి సహా పలువురు పార్టీ ప్రముఖులు హాజరవుతారన్నారు.

## తలసానికి మద్దతుగా ఇంటింటి ప్రచారం



అమీర్‌పేట్‌లో నిర్వహిస్తున్న ప్రచారంలో స్థానిక మహిళలతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి – అమీర్‌పేట్



బోయిగూడలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇన్‌చార్జి జీ పవన్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కార్యదర్శి ఎం.మహేందర్ తదితరులు. –బన్సీలాల్‌పేట్

## పద్మారావునగర్‌లో చండీహోమం



బీఆర్ఎస్ సర్కారు మళ్లీ రావాలని కోరుతూ పద్మారావునగర్‌లో చండీహోమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి తలసాని సతీమణి సువర్ణ హాజరయ్యారు. – బన్సీలాల్‌పేట్

## ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆర్టీసీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఏసీపీ శంకర్రాజు

బేగంపేట్ నవంబర్ 16 : సికింద్రాబాద్ రాణిగంజ్ బస్సు డిపోలో గురువారం డ్రైవర్లు, కండకర్లు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. బేగంపేట్ ట్రాఫిక్ పోలీసులు. బేగంపేట్ ట్రాఫిక్ ట్రేనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్రాజు ఆధ్వర్యంలో వీరికి అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీఎస్ ఆర్టీసీ బస్సులకు సంబంధించిన ప్రమాదాల్లో 21 పాదాచారులతో సహా 41 మంది మరణించినట్లు వెల్లడించారు. నగరంలో 13శాతం సిగ్నల్ జంప్, ఓవర్‌స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ అనధికార పార్కింగ్ వంటి ఉల్లంఘనలకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ బస్సులపై 3,909 ట్రాఫిక్ చలనాలు జారీ చేసినట్టు తెలిపారు. డ్రైవర్ల వలన బస్సులకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన అన్నారు.

## వ్యర్థాల నిర్వహణపై అవగాహన శిబిరం

అమీర్‌పేట్, నవంబర్ 16 : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ విద్యా విభాగం సమన్వయంతో సెయింట్ మేరీస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ (సికింద్రాబాద్)లో ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, రసాయనాల భద్రత నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దుండిగల్‌లోని వ్యర్థాల నిర్వహణ, రోజువారీ సౌందర్య సాధనాలు, రసాయనాల వినియోగం, వాటి నిర్వంహణ, భద్రత, రసాయనాల ఉచిత యాప్‌ల వినియోగం వంటి అంశాలపై ప్రాజెక్ట్ అధికారి బి.నాగేశ్వర్‌రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు.